ప్రజాశక్తి

గురువారం 21 సెప్టెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

నేటి నుంచి అసెంబ్లీ

సమస్యల ప్రస్తావనకు అవకాశం దక్కేనా?






వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మించాల్సిన ప్రదేశం



చిలకలూరిపేట ప్రాంతంలో సాగుకు నోచని పొలాలు



యూజిడి కోసం చేసిన పనులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో నెలకొన్న పలు సమస్యలకు ఈ సమావేశాల్లో కొంత మేరకైనా పరిష్కారం లభిస్తుందా లేదా? గతంలో మాదిరిగా ఇతర అంశాలపై పరిమితమై సమావేశాలు ముగుస్తాయా? అనేది అధికార, ప్రతిపక్ష సభ్యుల్లో సంశయం నెలకొంది.

వైసిపి ప్రభుత్వ హయాంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల ముందు దాదాపుగా ఇవే చివరి సమావేశాలుగా అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. యథాతథంగా షెడ్యూలు ప్రకారం ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు జరిగితే ఫిబ్రవరిలో ఓట్ ఆన్ ఎకౌంట్ సమావేశాలు జరుగుతాయని, లేదంటే షెడ్యూలు కన్నా ముందే ఎన్నికలు జరిగితే ఇవే చివరి సమావేశాలని ఎమ్మెల్యేలు చెప్పుకుంటున్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో గుర్తింపు పొందలేని వారికి ఇదే చివరి ఛాన్సు అని కొంత మంది వ్యాఖ్యలు చేస్తున్నారు.

రాజధాని అంశంలో కోర్టులో ఉన్నా దసరానుంచి విశాఖ నుంచి సిఎంవో పనిచేస్తుందని సిఎం జగన్ బుధవారం మంత్రి వర్గం సమావేశంలో వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అంశంపై రాజధాని రైతులు, అమరావతి జెఎసిలు ఇంకా తమ వైఖరిని వెల్లడించ లేదు. రాజధాని తరలింపును నిలిపివేస్తూ గతేడాది మార్చి 3న హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించినా ఇంత వరకు ఈ అంశంపై విచారణ జరగలేదు. నవంబరులో విచారణ జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో తాను దసరా నుంచి విశాఖ నుంచేపాలన చేస్తానని జగన్

▶ 2లో



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖాళీ కంచాలతో అంబేద్కర్ ఎదుట

- హాస్టల్ మెస్ ఛార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ నిరసన
- అసెంబ్లీలో నిర్ణయం తీసుకోకుంటే చలో విజయవాడ

ప్రజాశక్తి - గుంటూరు

సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థులకు మెస్ ఛార్జీలను వెంటనే పెంచాలని భారీ విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఖాళీ ప్లేట్లతో నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగం సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, హాస్టల్ విద్యార్థులకు వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని విమర్శించారు హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుకూలంగా మెస్‌ఛార్జీలు లేకపోవడం వల్ల నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. పెరిగిన ధరలకు, మెస్ చార్జీలకు ఏమాత్రమూ సంబంధం లేదని. నెలకు కనీసం రూ.2500 ఇస్తేనే విద్యార్థులు మూడుపూటలా తినగలుగుతారని అన్నారు. హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహించడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గుంటూరు నగరంలోని కోడిగుడ్ సత్రం హాస్టల్ ప్రారంభిస్తే అనేకమంది విద్యార్థుకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. అయితే ఆ హాస్టల్‌ను ప్రారంభించకుండా అధికారులు, ప్రజాప్రతినిదులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వమే నోట్ బుక్స్, యూనిఫామ్ ఇచ్చేదని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని నిలిపేసిందని, కాస్మోటిక్ చార్జీలు రూ.150 ప్రతినెలా

▶ 2లో



యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న కళాశాల విద్య రాష్ట్ర కమిషనర్ పోలా భాస్కర్

స్వేచ్ఛా యాత్రకు విద్యార్థినులు

మహిళా కాలేజీలో యాత్రను ప్రారంభించిన కళాశాల విద్య రాష్ట్ర కమిషనర్

ప్రజాశక్తి - గుంటూరు సిటి

కళాశాల విద్య రాష్ట్ర కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ఐఎఎస్

గ్లోబలికరణ నేపథ్యంలో జ్ఞానం విశ్వజనీయంగా విస్తరిస్తున్న క్రమంలో రాష్ట్రంలో కళాశాల విద్యలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టి విద్యార్థుల సమగ్ర వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కళాశాల విద్య రాష్ట్ర కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల నుండి కళాశాల విద్యార్థులలో ఆత్మవిశ్వాసం

▶ 2లో

లైంగిక దాడి యత్నం కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

చిన్నారిపై జరిగిన లైంగిక దాడి యత్నం కేసులో ముద్దాయికి ఏడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామకృష్ణారావు బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2017 ఏప్రిల్ 2న పొన్నూరు మండలం చింతలపూడిలో తల్లిదండ్రులు ఉదయం 10 గంటలకు చర్చిలో ప్రార్థనకు వెళ్లగా, వారి కుమార్తె ఇంటి దగ్గర ఆడుకుంటూ ఉంది. ఈ క్రమంలో ఆదే గ్రామానికి చెందిన దాసరి కోటేశ్వరరావు అలియాస్ కోటయ్య చిన్నారిని బలవంతంగా తన ఇంటిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి గట్టిగా అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో నిందితుడు పరారైయ్యాడు. చుట్టుపక్కల వారు జరిగిన విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి

▶ 2లో

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోకు సంబంధించి క్లస్టర్ వారీగా, సచివాలయం వారీగా ఎడ్యుకేషన్ సర్వే సక్రమంగా జరిగేలా సచివాలయంలోని ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వాలంటీర్లతో నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మండల, జిల్లా విద్యాశాఖాధి కారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ తో కలసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ ఇన్ఫోలో ఉన్న వివరాల ప్రకారం ఎడ్యుకేషన్ సర్వేలోని వివరాలు సక్రమంగా వుండేలా యంఈఓలు క్షేత్రస్థాయిలో ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వాలంటీర్లతో కలసి పరిశీలించాలన్నారు. జిల్లాలో డ్రాప్ ఔట్స్ లేకుండా ప్రతి ఒక్కరిని పాఠశాలల్లో చేర్పించేలా అవసరమైన చర్యలు ప్రణాళికా ప్రకారం తీసు కోవాలన్నారు. ఎడ్యుకేషన్ సర్వేకి సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. పేదలందరికీ ఇళ్ల పథకానికి సంబంధించి జిల్లాలో 2023 డిసెంబర్ నాటికి



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు కలెక్టర్, తదితరులు

▶ 2లో

వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - గుంటూరు సిటి

రాష్టంలోని నిరుద్యోగ యువతకు రాష్ట్ర నృపునాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ శిక్షణలలో భాగంగా వివిధ రకాల ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ బుధవారం తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్స్‌లో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి, శిక్షణనిచ్చి పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. 10 తరగతిపైన చదువుకున్న 18-30 ఏళ్ల వారు అర్హులని, న్యూఇయింగ్ మిషన్ ఆపరేటర్, ఎసి ఫీల్డ్ టెక్నీషియన్,సి.సి.టి.వి ఇన్స్టలేషన్ టెక్నీషియన్స్ కోర్సులకు ఈనెల 30 తేదీ లోగా 9533219919 ఫోన్ నంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బిహెచ్ కాలేజీలో వైద్యశిబిరం

ప్రజాశక్తి - గుంటూరు సిటి

నగరంలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ మహిళల కళాశాలలో అగ్రత డెంటల్ క్లినిక్ సిబ్బంది బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బీపీ, షుగర్ బారిన పడిన వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్ రాకుండా ఉండడానికి శారీరక వ్యాయామం దోహదం చేస్తుందని, ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట పాటు కచ్చితంగా వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి. ఎన్‌సిసి అధికారి ఎం.గిరిజ, కె.లక్ష్మీ దీప్తి పాల్గొన్నారు.

నేటి నుంచి అసెంబ్లీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటనపై అసెంబ్లీలో చర్చ జరిగే అవకాశం ఉంది.

మరోవైపు జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై అటు శాసన సభ, ఇటు మండలిలో చర్చించే అవకాశం ఉందంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అనేక ప్రాజెక్టులపై ప్రజా ప్రతినిధులు ప్రస్తావించనున్నారు. గుంటూరులో 2019లో నిలిచిపోయిన భూగర్భ డ్రెయినేజి పనులు, గుంటూరు ఛానల్ విస్తరణ, పొడిగింపునకు నిధులు విడుదల, వరికపూడిశెలకు కేంద్రం పర్యావరణ అనుమతి ఇచ్చినా నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు నిధులు విడుదల చేయలేదు. ఈ అంశాలపై మండలిలో చర్చ జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖరీఫ్‌లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో ఏ పంటలు వేయకుండా భూములు ఖాళీగా ఉన్నాయి. ఇంత వరకు ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు చేయలేదు. వర్షాభావం వల్ల పల్నాడు జిల్లాలో 11 మండలాల్లో కరువు పరిస్థితులు ప్రభుత్వం ఇంత వరకు ఈ కరువు మండలాల ప్రకటన చేయలేదు. కేంద్రం నుంచి నిధులు కోరలేదని వార్తలొచ్చాయి. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్టు వ్యవహారంపై కూడా అసెంబ్లీలో చర్చకు పట్టుపడతామని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాసమస్యల కంటే వివిధ శాఖల్లో అవినీతి అక్రమాలపైనే వాడీవేడిగా చర్చ జరిగే అవకాశం ఉంది.

ఖాళీ కంచాలతో అంబేద్కర్ ఎదుట

(మొదటి పేజీ తరువాయి)

ఇవ్వాలని నిర్ణయించినా ఇంకా ఒక్కరికి కూడా చెల్లించలేదని తెలిపారు. ఈ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, మెస్‌ఛార్జీలను పెంచకుంటే చలో విజయవాడ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే సమీర్, సుభాష్, సుచరిత, సహాయ కార్యదర్శి పవన్, నాయకులు భరత్ చంద్, ఆరిఫా, భగత్ సింగ్, ప్రశాంతి, సాత్విక్ పాల్గొన్నారు.

లైంగిక దాడి యత్నం కేసులో ఏడేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

దర్యాప్తు అధికారి రాంబాబు కేసును దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. కోర్టు మానిటరింగ్ సిబ్బందిని, కోర్టు కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ అభినందించారు.

ఎమ్మెల్యేకు భవన నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి భవన నిర్మాణ కార్మికులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.ప్రసాదరావు, సిలార్ మసూద్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలను నిలుపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నంబర్ 1214ను రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని కోరారు. ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కృష్ణ నాయక్, శ్రీకాంత్, కె.సాయి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చి సమస్యలు చెబుతున్న నాయకులు

755 మందిలో 449 మంది అర్హత

ప్రజాశక్తి - గుంటూరు సిటి

పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ పరిధికి సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్‌లో దేహదారుఢ్య పరీక్షలు బుధవారం కొనసాగాయి. పరీక్షలను గుంటూరు రేంజ్ ఐ.జి పాల్‌రాజుతో పాటు నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ సుప్రజా పరివేక్షిచారు. బుధవారం 755 మంది అభ్యర్థులకు గాను 449 మంది అర్హత సాధించినట్లు ఐ.జి తెలిపారు. వీరికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టుల అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టులతో పాటు 1600, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.





గుంటూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

వైసిపికి ప్రజలే బుద్ధి చెబుతారు

చంద్రబాబు అరెస్టుపై మాజీ మంత్రి కొల్లురవీంద్ర - కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వచ్చే ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెబుతారని మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర బిసి విభాగం అధ్యక్షులు కొల్లు రవీంద్ర అన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జి కోవెలమూడి రవీంద్ర ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు టిడిపి జిల్లా బిసి విభాగం అధ్యక్షులు వేములకొండ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. వివిధ వృత్తులకు సంబంధించిన బిసిలు వారివేషధారణలో బాబుకు తోడుగా మేము సైతం అని దీక్షలో పాల్గొన్నారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు సిఎం కావడం ఖాయం అన్నారు. చంద్రబాబుని జైల్లో పెట్టి ఆనందపడుతున్న జగన్ ఎన్నికలలో ఓటమి తరువాత నిద్రలేని రాత్రులు గడిపేపరిస్థితి వస్తుందన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. చంద్రబాబు అరెస్ట్‌పై ప్రజల్లోనూ, దేశవిదేశాల్లోనూ పోరాటాలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. గుంటూరు తూర్పు ఇంచార్జి మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ చంద్రబాబుపై కక్ష సాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఆధారాలు లేని కేసులో రిమాండ్ విధించి జైలుకు పంపించడం బాధాకరమన్నారు. గుంటూరు జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ , జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు సింహాద్రి కనకాచారి, నిమ్మల శేషయ్య, తాళ్ళ వెంకటేష్ యాదవ్,గాలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ టిడిపి ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఏడో రోజు చేరాయి. దీక్షలో టిడిపి ఎస్సీ సెల్, క్రిస్టియన్ సెల్ అనుబంధ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా మంగళవారం నరసరావుపేటలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న 37 మంది టీడీపీ శ్రేణులు పై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని టిడిపి నియోజకవర్గ బాధ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలిపితే కేసులు పెట్టమని ఏ రాజ్యాంగంలో ఉందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రాజ్యాంగాన్ని అపహస్యం చేస్తూ వైసిపి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతుందని దుయ్యబట్టారు. పోలీసులు ప్రజా పక్షాన బాధ్యతాయుతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించాలని కోరారు.

స్వేచ్ఛా యాత్రకు విద్యార్థినులు

(మొదటి పేజీ తరువాయి)

కలిగేలా గుంటూరు నుండి 16 మంది విద్యార్థినులు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య కడప, అనంతపూరం తదితర ఏడు జిల్లాలకు 700 కిలోమీటర్ల పాటు వారం రోజులు నిర్వహించే సైకిల్ యాత్ర 'పెడల్ ఫర్ ఫ్రీడమ్ 2023'ను మహిళా కళాశాలలో పోలా భాస్కర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం ప్రోద్భలంతో కమిషనర్ ఆఫ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రాష్ట్ర సిఐడి విభాగం, న్యాయ సలహా మండలి, రెడ్ రోప్ ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఇతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో 'క్యాంపెయిన్ విముక్తి' పేరుతో యాక్సిస్ టు జస్టిస్, ఉమెన్ ట్రాఫికింగ్, జీరో టాలరెన్స్, ప్రివెంటివ్ ఆఫ్ సెక్సువల్ హరాస్మెంట్ వంటి అంశాలతో ఆయా జిల్లాలలోని కళాశాలల్లో, పాఠశాలల్లో, విద్యార్థులు ఉద్దేశించి చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. జిల్లా ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ సిఐడి ఎస్పీ కేజీవి సరిత మాట్లాడుతూ విద్యార్థులు తమ చుట్టూ జరిగే అంశాలపై అప్రమత్తతతో ఉండాలని, మొబైల్ వాడకంలో, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో సాయం కోసం ఉచిత హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలేజీ ఎడ్యుకేషన్ రైడింగ్ ఆఫీసర్ డాక్టర్ తులసి మస్తానమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ రమా జోస్నకుమారి, రెడ్ రోప్ డైరెక్టర్ క్రిషో లైట్, సిసిఇ కవిత, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ డాక్టర్ పి.విజయలక్ష్మి, ఇన్నొవేషన్ కన్వీనర్ డాక్టర్ సంతోషి, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ ధాత్రి కుమారి, లత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్ లేకుండా చర్యలు : కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి)

31,046 గహాలు పూర్తి చేయాలని లక్ష్యాలు నిర్దేశించినందున ప్రతి వారం పూర్తి చేయాల్సిన గృహాలపై నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా గహ నిర్మాణ శాఖాధికారులతో పాటు యంపీడీఓలు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంకు సంబంధించి అర్జీలు దరఖాస్తులు సంతప్తి చెందేలా మెరుగైన పరిష్కారం అందిం చాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాలు, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు సూచనలు అందించారు. సమావేశంలో డిఈఓ శైలజ, జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు, పంచాయితీ రాజ శాఖ ఎస్.ఈ బ్రహ్మయ్య, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, సిపిఓ శేషశ్రీ పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన న్యాయమూర్తికి ఘన సన్మానం

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు లీగల్: సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తూ ఇటీవల పదోన్నతి పొందిన గుంటూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.చంద్రమౌళీశ్వరి పదోన్నతిపై పెద్దాపురంలోని ఏడో అడిషనల్ జిల్లా కోర్టుకు నియమితులైయ్యారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తులు, గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆమెను డీఎల్ఎస్ఏ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి, గుంటూరు ఒకటో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి సీహెచ్ రాజ గోపాలరావు, రెండో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి వీఏఎల్ సత్యవతి, మూడో అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి జి.అర్చన, పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.సీతారామ కృష్ణారావు, గుంటూరు బార్



అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీకే సురేష్, వైస్ ప్రెసిడెంట్ దాసరి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపి లావు కృష్ణదేవరాయులు చొరవతో..

పల్నాడులో పొలాలకు రహదారులు

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

పల్నాడులోని పల్లె బాటలు అభివద్ధి బాట పడ్డాయి. గ్రామాల్లోని పొలాలు, డొంక రోడ్లు కొత్త రూపు దిద్దుకుంటున్నాయి. ఏళ్ల నాటి నుండి మరుగున పడ్డ రోడ్లు అభివద్ధి జరిగి రైతులకు, ప్రజలకు మేలు కల్గుతుంది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకష్ణదేవరాయలు తన సొంత నిధులతో గ్రామాల్లో డొంకలకు, పొలాలకు వెళ్లేందుకు అనువైన రోడ్లు నిర్మిస్తున్నారు. మిషనరీ సమకూర్చి రైతులు, నాయకుల సహకారం తీసుకుని ఈ నిర్మాణాలు చేపట్టారు. తన సొంత నిధులతో ఆయా గ్రామాల్లో రోడ్ల అభివద్ధికి అవసరమైన.. మిషనరీ అంటే క్రేన్, టిప్పర్, రోలర్‌ను పంపించి,, స్థానిన నాయకులు, రైతుల సహకారం తీసుకుని రోడ్ల అభివద్ధి చేపట్టడం మొదలు పెట్టారు. మొదట్లో అంతగా ఆదరణ రాకపోయినప్పటికీ.. కొద్ది రోజుల్లోనే నాయకులు, రైతులు ఎంతో ఉత్సాహంతో రోడ్లను అభివద్ధి చేసుకున్నారు. మిషనరీని ఉపయోగించుకుంటూ.. ప్రధాన డొంకలు, పొలాల రోడ్లలో ముళ్ల పొదలను, చెట్లను శుభ్రం చేసుకోవడం, అలాగే లభ్యతను బట్టి మట్టిని తరలించుకుని రోడ్లను ఎంతో సుందరంగా, ఉపయుక్తంగా అభివృద్ధి చేపట్టారు. గత 10 నెలల కాలంలో 86గ్రామాల్లో 435 కిలో మీటర్ల మేరకు రహదారులు నిర్మించినట్టు ఎంపి లావు కృష్ణదేవరాయులు తెలిపారు. దీంతో రైతులు వారి సామాగ్రిని, ఎరువులను పొలాలకు తరలించుటకు తేలిక అయ్యిందన్నారు.



ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం జరగాలి

గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

ప్రజాశక్తి - గుంటూరు సిటీ

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారును బుధవారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్ ఆదేశించారు. స్థానిక తాడేపల్లి, చేబ్రోలు, తెనాలి, తూళ్లూరు పోలీసు స్టేషన్ పరిధిలోని నీరు ప్రవహించే ఘాట్లును రోడ్డు ఇరువైపుల గల నిమజ్జనం ప్రాంతాలన్ని పరిశీలించాలని అధికారులకు చెప్పారు. నిమజ్జన ప్రదేశాలు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు నిఘా నిర్వహిస్తూ తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎత్తయిన విగ్రహాలును నిమజ్జనం చేసే సమయంలో, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నట్లయితే నదిలోకి దిగకుండా క్రేన్ల సాయంతో నిమజ్జనాలు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతాలలో అవసరం మేరకు సిబ్బందిని కేటాయించి, నగరపాలక సంస్థ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక సిబ్బందులతో పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రహదారులు, కూడళ్ల వద్ద పటిష్ట బందో బస్తుతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు జరిగేలా చూడాలని, లైఫ్ జాకెట్లు, నాటు పడవలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకో వాలన్నారు.

వివాదంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణం

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక గ్రంథాలయం పక్కన నిర్మించ తలపెట్టిన అంగన్వాడీ కేంద్రం నిర్మాణంలో వివాదం నెలకొంది. సిఆర్‌డిఎ అధికారులు అంగన్వాడీ కేంద్రం నిర్మాణానికి అనుమతి ఇవ్వగా పనులు మొదలయ్యాయి. నిర్మాణానికి కావల్చిన కంకర, ఇసుక, ఇనుము లాంటి నిర్మాణ సామాగ్రిని సిద్దం చేస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది అంగన్వాడి కేంద్రం నిర్మాణానికి అభ్యంతరం చెబుతున్నారు.1945 నుండి డి - నంబరు 52 లో 4ఎకరాల 5సెంట్లు భూమి ఉందని, సదరు భూమి పువ్వాడ, మందపాటి వంశస్తుల స్వాధీనంలో ఉందని వాదిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి 2 ఎకరాలు, గ్రంధాలయం, పశువుల ఆసుపత్రి, బస్ స్టాండ్ నిర్మాణానికి మరో 0.70 సెంట్లు దానం చేయగా మిగిలిన స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించేం దుకు సన్నాహాలు చేస్తున్నామని అంటున్నారు. తమకు చెందిన స్థలంలో అంగన్వాడీ కేంద్రం నిర్మాణం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం తహశీల్దార్ కల్యాణికి వినతి పత్రం అందజేశారు. పూర్తి వివరాలు తెలుసుకొని అవసరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ చెప్పారు.

నోటీసులు ఇవ్వడం అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : నాలుగు దశాబ్దాలుగా నివాసముంటున్న పేదలను ఇళ్లు ఖాళీ చేయమని నోటీసులు ఇవ్వడం అన్యాయమని టిడిపి నాయకులు అమరా సుబ్బారావు విమర్శించారు. బుధవారం టిడిపి నాయకులు మదర్‌థెరిస్సా కాలనీలో పర్యటించారు. పేదల సమస్యలు తెలుసు కున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల ఇళు తొలగించడమే పనిగా పెట్టుకున్నా రన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే నియోజ కవర్గంలోని పేదల ఇళ్లకు పట్టాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బిరుదుగడ్డ రమేష్, మారుమక అబ్రహం, శేషంశెట్టి శ్రీనివాసరావు, కొలంటీ మహేశ్వరరావు, బిరుదుగడ్డ లూర్ద్ రాజు, మారుమాక రాజేష్, కుక్క మల్ల వేలంగిని తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పొన్నూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుకన్య హెచ్చరించారు. గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ పరిధిలోని వివిధ ప్రదేశాలలో బుధవారం సాయంత్రం మట్కా ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.5,940 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ముద్దాయిలను తగు చర్య నిమిత్తం పొన్నూరు అర్బన్ పోలీసులకు స్వాధీనం చేశారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని ప్యారీ కంపెనీ సమీపంలో బుధవారం రైలు కింద పడి యువకుడు మృతిచెందాడు. ఉద్దేశపూర్వకంగానే రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్లు చూసిన వారు చెబుతున్నారు. పోలీసలు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మంత్రి వంశి(24)గా గుర్తించారు. మృతుడు వంశి చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడంతో అమ్మమ్మ ఇంటి వద్ద ఎర్రబాలెం బసవతారకనగర్‌లో ఉంటున్నాడు. విజయవాడలో ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి బయటకు వెళ్లాడని, మానసికంగా ఇబ్బంది పడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - గుంటూరు సిటీ :తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగర పరిధిలోని పెద్ద పలుకులూరు గ్రామంలో చోటు చేసుకుంది. నల్లపాడు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ నూతక్కి నరహరి తెలిపిన వివరాల ప్రకారం కందుకూరి సుకన్య (17) తన తండ్రి మల్లేశ్వరరావు మందలించడంతో మనస్థాఎ—ానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప కడ్డీకి ఉరేసుకొని చనిపోయిందని తెలి పారు. సుకన్య తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిజిహెచ్‌కి తరలించారు.

బకింగ్‌హామ్‌లో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి-తాడేపల్లి :పట్టణంలోని పోలకంపాడుకు చెందిన మత్స్యకార యువకుడు బుధవారం బకింగ్ హోమ్ కాలువలో పడి గల్లంతయ్యాడు. అతని కోసం బంధువులు హెడ్ స్లూయిస్ గేట్లు ఆపించి దుగ్గిరాల లాకుల వరకు కాలువ వెంట వెతుకుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా తులసి యోగీష్ చంద్ర పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి -గుంటూరు సిటి



ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు కుమారుడు తులసి యోగీవ్ చంద్ర జన్మదిన వేడుకలు బుధవారం రాజకీయ నాయకులు, కార్యకర్తలు, పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి. స్థానిక అరండల్ పేట లోని తులసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన్మదిన భారీ కేకును తులసి యోగీష్ కట్ చేశారు. పలువురు నేతలు, శ్రేయోభిలాషులు, అభిమానులు యోగీష్‌ను పుష్పమాలలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. భవిష్యత్తులో తులసి గ్రూప్ సంస్థలు మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంచేంచారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ, ఆత్మీయుల సమక్షంలో మా అబ్బాయి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందదాయకంగా ఉందన్నారు. పేద ప్రజల అభ్యున్నతికి తులసీ సంస్థలు బాసటగా నిలుస్తాయన్నారు. ప్రతీ ఒక్కరి సహకారంతో, అకుంఠిత దీక్షతో తులసి సంస్థలు ప్రజల అభిమానాన్ని చూర గొన్నాయన్నారు. ఇప్పటివరకు తులసి గ్రూపు సంస్థల ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, పేద విద్యార్థులకు 25 ఏళ్లకు పైగా ఉపకారవేతనాలు అందిస్తున్నామని మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు చేయాలనే ఉద్దేశం తోనే బిజెపిలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తులసి యోగీష్ చంద్ర మాట్లాడుతూ తాను, తన సోదరుడు తులసి కృష్ణ చైతన్య ఈ తులసి గ్రూప్ సంస్థను ఎంతో బాధ్యతతో, ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా నిర్విరామంగా రెండువేలమంది సిబ్బంది తో నడుపుతున్నామని అన్నారు. భవిష్యత్తులో పది వేలమందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ధ్యేయమని . దీనికొరకు ఇప్పుడు వున్న ఉద్యోగుల పనితీరు చాల ముఖ్య భూమిక పోషిస్తున్నదని ఆయన పేర్కొన్నారు

కూర్చునే స్వతంత్రమూ లేదా?

ప్రజాశక్తి - చిలకలూరిపేట

బెల్లంకొండ మండలం మాచాయపాలెంలో దళితుడైన సోమాబత్తిని సుందర్రావును కులం పేరుతో దూషించి దాడి చేసిన పెత్తందారుడు కర్నాటి రమేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుతో పాటు అతనిని వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక పండరిపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. అరుగుపై కూర్చున్నందుకే దాడి చేయడం అంటే సమాజం ఎటుపోతుందో ఆందోళనగా ఉందని, కూర్చునే స్వతంత్రమూ దళితులకు లేదా? అని ప్రశ్నించారు. ఒకవైపు పరిస్థితులు ఇలా ఉంటే మరోవైపు అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని, పోలీసులు, పాలకులు ఇప్పటికైనా స్పందించి తాజా ఘటనలో నిందితులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.


మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - అచ్చంపేట

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని అచ్చంపేట జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం సిహెచ్ కళ్యాణి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో 50 మొక్కలను నాటారు. వేలూర్పు జెడ్‌పి పాఠశాలలోనూ 100 మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ సెక్రటరీ పి.పాపిరెడ్డి, హెచ్‌ఎం అగస్త్యన్‌రెడ్డి, ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ టి.కరిముల్లా బాబు పాల్గొన్నారు.


హక్కు పత్రాలను అందిస్తున్న ఆర్‌డిఒ

భూ హక్కు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - చిలకలూరిపేట

మండల పరిధిలోని రాజపేటలో జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగముగా రీసర్వే పూర్తి చేశామని ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి తెలిపారు. ఈమేరకు మంజూరైన భూ హక్కు పత్రాలను రైతులకు బుధవారం అందించారు. మిగతా పత్రాలను ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా హక్కుదార్లకు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జి.సుజాత, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు సూపర్‌వైజర్లు నియామకం

ప్రజాశక్తి - రెంటచింతల

మండలానికి ఇద్దరు అంగన్‌వాడి సూపర్వైజర్లను నియమిస్తూ అధికారుల ఉత్తర్వులు జారీ చేసినట్లు మాచర్ల సిడిపిఒ లీలావతి బుధవారం తెలిపారు. గుంటూరు నుంచి వచ్చిన నాగమణి, 75 తాళ్లూరు సెక్టార్ నుంచి శ్రీదేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఎక్కడి సమస్యలక్కడే పరిష్కారం

- మాచర్ల నియోజకవర్గ స్థాయి 'జగనన్నకు చెబుదాం'లో పల్నాడు కలెక్టర్ శివశంకర్
- డప్పు కళాకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆదేశం
- బుధవారం, శుక్రవారమూ మండల స్థాయిలో అర్జీల స్వీకరణ


ఇళ్ల స్థలాల కోసం జిల్లా కలెక్టర్‌కు అర్జీలిస్తున్న డప్పు కళాకారులు

ప్రజాశక్తి - మాచర్ల

పరిపాలనను ప్రజలకు చేరువ చేసి వారి సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. స్థానిక మానుకొండ కళ్యాణ మండపంలో మాచర్ల నియోజకవర్గం స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్ర మాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం తోపాటు బుధవారం శుక్రవారం కూడా మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందన్నారు. వచ్చిన అర్జీలను క్రింది స్థాయిలోనే ఎక్కడికక్కడ పరిష్కరించాలని, లేకుంటే అవి అంచలవారీగా కలెక్టర్ వరకు వస్తున్నాయని అన్నారు. ఫిర్యాదులను సమయానికి అనుగుణంగా పరిష్కరించాలన్నారు. ఇంటి స్థలం కోసం డప్పు కళాకారులు అర్జీలిచ్చారని, వారికి వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అద్దయ్య, మున్సిపల్ చైర్మన్ ఎం.చినఏసోబు, వైస్ చైర్మన్ పి.నరసింహారావు, కమిషనర్ రమణబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబిత సవరణలపై సమీక్ష

కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణల పరిశీలనపై సమీక్షలో మాట్లాడుతూ అవకతవకలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. రాజకీయ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్‌ను ఓటర్ల సవరణలో భాగస్వామ్యం చేయాలని చెప్పారు. వారి నుండి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా క్షేత్ర స్థాయిలో పరిష్కరించేలా చూడాలన్నారు. రాజకీయ నాయకుల ఆరోపణలు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఆర్‌ఒ గబ్రూ నాయక్, జిల్లా సచివాలయల అధికారి మహలక్ష్మి, ఆర్‌డిఒ అద్దెయ్య, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికార్లు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-ఈపూరు


రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ రవిబాబు

మండల కేంద్రమైన ఈపూరులోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఎడిఎ రవిబాబు బుధవారం తనిఖీ చేశారు. మన గ్రోమోర్ కేంద్రంలో నిల్వ ఉన్న ఎరువుల బస్తాలను పరిశీలించారు. పురుగు మందుల దుకాణాలలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వాలని షాపు యజమానులకు సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ ఉన్న ఎరువులపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు సంప్రదించాలని రైతులకు సూచించారు. రైతులకు శనగలు అందుబాటులో ఉంచామన్నారు. వ్యవసాయ బోరు మోటార్ల కింద సాగు చేసే పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నామని, కౌలు రైతు కార్డులకు వ్యక్తిగత వ్యవసాయ రుణాలు అందిస్తున్నామని అన్నారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు, ఏఈఓ అప్పారావు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఉమాదేవి

నిధుల వినియోగంపై సమీక్ష

ప్రజాశక్తి -అమరావతి

సచివాలయ సిబ్బందికి మండల కేంద్రమైన అమరావతిలోని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగంపై సమీక్షించారు. ఎంపిడిఒ ఉమాదేవి మాట్లాడుతూ మండల పరిధిలోని 16 సచివాలయాలకు సంబంధించిన గృహ నిర్మాణం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌బికె, నాడు-నేడు జనరల్ ఫండ్ కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వద్దని సూచించారు.


పోటీలను ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి తుర్లపాటి చౌడయ్య

క్రీడలతో గుర్తింపు, ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-ఈపూరు

క్రీడల్లో రాణించడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందొచ్చని జెడ్‌పిటిసి తుర్లపాటి చౌడయ్య అన్నారు. మండల కేంద్రమైన ఈపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి ఆటల పోటీలను రెండ్రోజుల పాటు నిర్వహించనున్నారు. పోటీలను బుధవారం ప్రారంభించిన జెడ్‌పిటిసి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. చేసే ప్రతి పనిలో లక్ష్యాలను నిర్ధేశించుకొని కృషి చేస్తే సత్ఫలితాలు వస్తాయని చెప్పారు. హెచ్‌ఎం ఎన్.రామకృష్ణారెడ్డి మాట్లా డుతూ గెలుపోటములు సహజమని, విద్యార్థులు ఐకమత్యంతో మెలిగి క్రీడా స్ఫూర్తితో ఆడాలని చెప్పారు. క్రీడా దుస్తులు ఉచితంగా అందజేసిన ఉపాధ్యా యులు డి.సుబ్రహ్మణ్య ప్రసాద్, వి.అనురాధ, ఏపీఈఈ యూనియన్ సభ్యులు, అంగలూరు సొసైటీ సిబ్బంది జి.శేఖర్ ను అభినందించారు. కార్యక్ర మంలో పిఇటిలు ఎ.వీరాంజనేయులు, ఎం.వెంకటేశ్వర్లు, వై.చిరంజీవి, ఎస్.రూత్ మేరీ, గోపి, ఝాన్సీ పాల్గొన్నారు.


నిమజ్జన ప్రదేశంలో పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

నిమజ్జనలో అపశృతులకు తావివ్వొద్దు

ప్రజాశక్తి - అమరావతి

వినాయక విగ్రహ నిమజ్జనాల్లో అపసృతులకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందిని డీఎస్పీ బి.ఆదినారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన అమరావతి ధ్యాన బుద్ధ ప్రాజెక్టు వెనుక వైపు వినాయక నిమజ్జనం జరుగుతున్న ప్రదేశాలను సందర్శించారు. పోలీస్ సిబ్బందికి, ఎస్కార్ట్ సిబ్బందికి, పడవ నిర్వహకులతో మాట్లాడారు. నదిలో స్నానాలకు ఎవరు దిగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అపసృతులు వాటిల్లితో వాటికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సిఐ ఎవి బ్రహ్మం, ఎస్సైలు నాగేంద్రరావు, వెంకటేశ్వర్లు, మాబు సుభాని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అమరావతిలోని మేదర బజారులో న్యాచురల్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద అన్నదానం చేశారు. ఉప సర్పంచ్ ఎన్.విజయ సాగర్ బాబు, కమిటీ సభ్యులు వెంకీ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మంగళగిరి నియోజకవర్గంలో

ఎర్రజెండా అండతో పేదలకు వేలాదిగా ఇళ్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో వేలాది మందికి ఇళ్లు వేయించిన చరిత్ర ఎర్రజెండాకు ముఖ్యంగా సిపిఎంకు దక్కుతుంది. పేదలకు ఎందుకు పనికి రాని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేయించేందుకు సిపిఎం నాయకులు జైళ్ల పాలయ్యారు. లాఠీ దెబ్బలు తిన్నారు. తీవ్రమైన 307 సెక్షన్ హత్యాయత్నం కేసు పోలీసులు సిపిఎం నాయకుల మీద నమోదు చేశారు. ప్రస్తుతం మంగళగిరి నియోజకవర్గంలో సుమారు 20 కాలనీల్లో ఆరు వేల మంది పేదలు ఇళ్లు వేసుకుని నివాసం ఉంటు న్నారు. మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, బూదాల డేవిడ్, రంగరావు తదితర నాయకుల పోరాట త్యాగం ఇందులో ఇమిడి ఉన్నాయి. ఆ వారసత్వాన్ని మంగళగరి నియోజకవర్గంలో నేటికీ నాయకులు కొనసాగిస్తున్నారు. మంగళగిరి పట్టణంలో రత్నాల చెరువు, సుందయ్యనగర్, శ్రామికనగర్, గ్రంథాలయపేట, బాపనయ్యనగర్ 1, 2, కొత్తపేట, పార్కు రోడ్డు, డ్రైవర్‌పేట, భగత్‌సింగ్‌నగర్, అమరారెడ్డికాలనీ, నులకపేట లోని ఎర్రగడ్డ, సుందరయ్యకాలనీ, డ్రైవర్‌కాలనీ, సుందరయ్య ప్రెస్‌కాలనీ, ఎమ్మెల రామయ్య కాలనీ, కత్తులపేట, కెఎల్‌రావు కాలనీ, లంబాడీపేట, రన్నింగ్‌రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రెండు వేల మందికి పైగా పేదలు ఇప్పటికీ ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. వీటిలో కొన్నింటికి



ఎమ్మెల రామయ్య కాలనీ





సుందరయ్య నగర్

మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ రామ్మోహనరావు సహకారంతో సిపిఎం నాయకులు ఇళ్లపట్టాలు ఇప్పించారు. ఇళ్లపట్టాలు రాని వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని, ఆ భూములను రెగ్యులరైజేషన్ చేయాలని ఇప్పటికీ సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. కృష్ణానది ఒడ్డున సీతానగరం, సెటిల్‌మెంట్ ఏరియాల్లో మరో 500 ఇళ్లు రూపుదాల్చుకున్నాయి. కృష్ణానదికి వరద

పావురాల కాలనీ, ఆత్మ కూరు గ్రామంలోని నిమ్మగడ్డ రామ్మోహనరావు నగర్, గణపతినగర్, అమరారెడ్డినగర్, ఖాజ గ్రామంలోని పుల్లయ్యనగర్, నిడమర్రు గ్రామంలోని గిరిజనకాలనీ, యర్రబాలెం గరువుల మీద పేదలకు ఇళ్లు వేయించారు. వీటన్నంటి వెనుక సిపిఎం నాయకులతో పాటు విశ్రాంత అధికారులు పిల్లి గోపాలరావు లాంటి వారి కృషి కూడా ఉంది. మంగళగిరి పట్టణం చుట్టుపక్కల గ్రామాల్లో 2500 మందికి సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్లు దక్కాయి. తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్, మహానాడు, ముత్యాల నగర్, అమరారెడ్డినగర్, వచ్చిన సందర్భంలో ఇళ్లు కోతకు గురవుతున్న సమయంలో రివిట్‌మెంట్ నిర్మించాలని ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు అర్జీలు ఇవ్వడంతో పాటు సంబంధిత సచివాలయాల వద్ద ఆందోళనలు చేశారు. వీటితో పాటు అమరారెడ్డినగర్, అమరారెడ్డికాలనీ, ముత్యాలనగర్ ప్రాంతాల్లో కూడా ఎర్ర జెండా అండతో పేదలు ఇళ్లు వేసుకోగలిగారు. వడ్డేశ్వరం, మెల్లెంపూడి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే నిమ్మగడ్డ కృషితో ప్రభుత్వంతో భూములు కొనుగోలు చేయించి పేదలకు పక్కా ఇళ్లు ఇప్పించిన చరిత్ర కూడా సిపిఎంకు ఉంది.

250 మందికి లబ్ధి చేకూరే ఈ భూ పంపిణీలో ఆనాటి ఆర్‌డిఒ మురళి సిపిఎం నాయకులకు సహకరించి స్థలాలు రావడానికి కారణమయ్యారు. ఉండవల్లి బాపనయ్యనగర్, అమరారెడ్డినగర్ ప్రాంతాల్లో సుమారు 500 మంది ఇళు వేసుకుని నివాసం ఉంటున్నారు. పెనుమాక కొండ ఫారెస్టు ప్రాంతంలో సిపిఎం నాయకులు కళ్లం పుల్లారెడ్డి ఆధ్వర్యంలో సుమారు 700 మంది పేదలు ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారు. సిపిఎం నాయకుల కృషి వల్ల పైన పేర్కొన్న ప్రాంతాల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు అధికారులు కల్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలో పేదల ఇళ్ల కోసం పాటుపడింది.. నిలబడింది.. తలబడింది... గెలిచింది ఎవరంటే సిపిఎం అనే పేరు మొట్టమొదటగా పేదల నుంచి వినిపిస్తోంది. సిపిఎం భూపోరాటం వల్ల, కొన్నిచోట్ల సిపిఐ, ఎంఎల్, మరికొన్నిచోట్ల ప్రభుత్వం ఇచ్చిన స్థలాల వద్దగానీ 6,700 మందికి పట్టాలు రావాల్సి ఉంది. వీటి కోసం సిపిఎం పెద్దఎత్తున ఆందోళన చేస్తుంది. ఇంటి స్థలాల సమస్య నేడు పెద్దఎత్తున ప్రజల ముందుకు వచ్చింది. ప్రభుత్వం కూడా దానిని ఎజెండా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఎక్కడున్నవారికి అక్కడే పట్టాలివ్వాలి

సిపిఎం ఎక్కడున్న స్థలాలకు అక్కడే పేదలకు పట్టాలివ్వాలని, అసలు ఇళ్లస్థలాలు లేని వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇందుకు పెద్దఎత్తున పోరాటాలు నిర్వహిస్తోంది. బాధిత ప్రజలు ఈ పోరాటాలకు కదిలిరావాలని విజ్ఞప్తి చేస్తుంది.

26న క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హై స్కూల్ క్రీడా ప్రాంగ ణంలో, 26న అండర్ - 17 క్రికెట్ బాల్ జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు జరగను న్నట్లు, ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి షేక్ రన్ను హుస్సేన్ బుధవారం తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు 2007 జనవరి 1 తర్వాత జన్మించి, అకాడమిక్ మానిటరింగ్‌లో రిజిస్టర్ అయ్యి ఉండాలన్నారు. జిల్లా జట్టుకు జరిగే ఈ ఎంపికలో అర్హత ఉన్న క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99661 22055 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

విఆర్‌ఎ గురునాథబాబు కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



విఆర్‌ఎల మండల మాజీ అధ్యక్షులు మొండితోక గురునాథ బాబు (థామస్) (48) బుధవారం ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలోని ఆయన నివాసంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురునాథ బాబు మృతి వార్త తెలుసుకున్న సిఐటియు తాడేపల్లి మండల నాయకులు వేముల దుర్గారావు, వీఆర్‌ఏల మండల కమిటీ సభ్యులు గురునాథ్ బాబు మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గురునాథ బాబు వీఆర్‌ఏల సంఘం సంఘటిత పరిచేందుకు విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆయన అకాల మరణం వీఆర్‌ఏల సంఘానికి తీరని లోటని అన్నారు. తాడేపల్లి మండల డిప్యూటీ తాసిల్దార్, ఆర్ ఐ లు గురునాథ బాబు మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి, మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఏల మండల నాయకులు బొక్క సాంబశివరావు, టీ. హనుమంతరావు, నాగేశ్వరరావు, ఈ.ప్రతాప్, పి రాజు, పి అమ్మా రావు, ఎన్ రామారావు, మున్సిపల్ కార్మికురాలు సంతోషం తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

25న విజయవాడలో అంగన్వాడీల మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గుంటూరు సిటి

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 25న విజయవాడలో జరిగే మహాధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి పి దీప్తి మనోజ పిలుపునిచ్చారు. సిఐటియు కార్యాల యంలో ఎన్. రమా సుష్మ అధ్యక్షతన జరిగిన యూనియన్ జిల్లా విస్తృత సమావేశంలో ఆమె ప్రసంగించారు. గత ఎన్నికలకు ముందు వైసిపి తాము అధికారంలోకి వస్తే తెలంగాణ కంటే అదనంగా జీతాలు ఇస్తామని వాగ్దానం చేసిందని అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు గడిచి తిరిగి ఎన్నికలకు వెళ్ళబోతున్న సందర్భంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కంటే అంగన్వాడీలకు అదనంగా జీతాలు ఇవ్వకపోగా అన్ని సౌకర్యాల్లోనూ వెనకకు నెట్టిందని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ చెల్లించాల్సి ఉండగా దానిపై నోరెత్తడం లేదని గతంలో ఇచ్చే నామమాత్రపు పరిహారం కూడా గత రెండేళ్లుగా రిటైర్ అయిన వాళ్ళకి ఇవ్వడం లేదని అన్నారు. గత ఆరు మాసాలుగా ఒకసారి చలో విజయవాడ, మరోసారి కలెక్టరేట్ల వద్ద 36 గంటల నిరసన కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వం నుండి ఏమాత్రం స్పందన లేదని ఉద్యమాన్ని తీవ్రతరం చేసే దానిలో భాగంగా ఈ మహా ధర్నా చేపట్టడం జరిగిందని అన్నారు. జిల్లా అధ్యక్షులు ఎన్ రమా సుష్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు కూడా అంగన్వాడీలకు వర్తించకుండా ప్రభుత్వం అంగన్వాడీ లకు అన్యాయం చేసిందని తీవ్రమైన పని భారం మోపుతూ అంగన్వాడీల చేత వెట్టి చాకిరి చేయిస్తున్నదని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై నేతాజీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అంగన్వాడీ సెంటర్లోనూ సౌకర్యాల కొరత కొట్ట వచ్చినట్లు కనబడుతున్నదన్నారు. రాజకీయ నాయకుల చేతికి పెత్తనమిస్తున్నారని దీనిని నిరోధించేందుకు యూనియన్ ఆధ్వర్యంలో పోరాడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు కే .పద్మ, శ్యామల, ప్రేమలీల, ఎం శ్రీవాణి, చిన్న వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి :ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా పని భారం పెంచినా పని చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పాలక పార్టీలు విస్మరిస్తున్నాయని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం అంగన్‌వాడీ ముఖ్య కార్యకర్తల సమావేశం కృష్ణనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ 25న చలో విజయవాడకు తరలిరావాలని కోరారు.




గుంటూరు సమావేశంలో మాట్లాడుతున్న దీప్తి మనోజ



తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న వేముల దుర్గారావు

రాజధానిలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - తుళ్లూరు :రాజధాని ప్రాంతం లోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం మంత్రి వర్గ సమావేశంలో తగు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాజధాని డివిజన్ కమిటి కోరింది. ఈ మేరకు సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఒక ప్రకటనలో కోరారు. రాజధాని రైతులు,అసైన్డ్ రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ కౌలు సెప్టెంబర్ నెల పూర్తికావస్తున్నా ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయమని,పెండింగ్ కౌలును వెంటనే రైతుల అకౌంట్ల లో అధికారులతో జమ చేయించే విధంగా మంత్రివర్గం చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధానిలో భూమిలేని పేదలకు ఇస్తున్న సామాజిక పెన్షన్ రూ 2,500 నుండి 5వేలకు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వమే హామీ ఇచ్చిందని, గత రెండు సంవత్సరాల నుండి బడ్జెట్లో నిధులు కూడా కేటాయిస్తూ పెన్షన్ మాత్రం పెంచడం లేదని, ఈ మంత్రివర్గ సమావేశం లోనైనా రాజధాని పేదల పెన్షన్ పెంచే విషయం చర్చించి పెన్షన్ ను రూ 5 వేలకు పెంచుతూ మంత్రివర్గం తీర్మానించి అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజధాని గ్రామాల పారిశుధ్య కార్మికుల వేతనాల విషయం చర్చించి వారి వేతనాలను పెంచే విధంగా మంత్రివర్గం నిర్ణయం తీసుకోవాలని రవి ప్రభుత్వాన్ని కోరారు.




25న ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

రాజధాని రైతుల కు కౌలు చెల్లించాలని, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన తహసిల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని ఎర్రబాలెం గ్రామంలో బుధవారం జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. సమావేశానికి రైతు సంఘం నాయకులు ఎ. వీర వెంకయ్య అధ్యక్షత వహించారు. జొన్న శివశంకర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంత రైతులకు ఇవ్వవలసిన కౌలు ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ కె . ఎర్ర పీరు, ఆకుల వెంకటేశ్వరరావు, పూర్ణయ్య, ఆర్ సాంబశివరావు, రుద్రు యలమందరావు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్



వ్యవసాయ రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈరోజు పెదనందిపాడు మండలంలో కరపత్రాల ప్రచారం, రైతుల వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతుల దగ్గర నుండి సంతకాలు సేకరించిన వినతి పత్రాలను నాగులపాడు, నందిపాడు, వరగాని రైతు భరోసా కేంద్రాలలో అధికారులకు అందజేశి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె వెంకట శివరావు, నాగేశ్వరరావు, దొప్పలపూడి రమేష్ బాబు, జంపని రామారావు, చుక్కా యానాదులుపాల్గొన్నారు.

కొండవీటి వాగు ముంపు సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -తాడికొండ : కొండవీటి వాగు ముంపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ కోరారు. బుధవారం తాడికొండ ఆర్‌బికెలఓ ఈ మేరకు వినతి పత్రాలను అందించారు.



కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కనగాల పూర్ణచంద్రరావు, చింతల భాస్కరరావు, తియ్యగూర పిచ్చిరెడ్డి, బోళ్ల తాతిరెడ్డి, సాంబ శివరావు, శంకరావు పాల్గొన్నారు.

ఏళ్ల తరబడి చాకిరి చేస్తున్నా కనీస వేతనం కరువు

- కుటుంబాలు గడవక అవస్థ పడుతున్నాం
- బిల్లులు పెండింగ్‌లో పెట్టారు
- మా సమస్యలను అసెంబ్లీలో చెప్పండి
- ఎమ్మెల్యే, అధికారులకు అంగన్వాడీల వినతి
- 25న విజయవాడలో మహాధర్నా జయప్రదానికి పిలుపు


ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు, నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనే పేద వాడల్లో జీవిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన గర్భిణులకు, బాలింతలకు, బాలలకు 48 ఏళ్లుగా సేవలు చేస్తూ ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చే దిశలో అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లు ఎంతో కృషి చేస్తున్నారని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, జి.మల్లీశ్వరి అన్నారు. అయినా వీరికి కనీస వేతనాలు ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు బుధవారం ప్రాజెక్టు కార్యాలయంలో సుపెరినెంట్‌కు, సిడిపిఒ ఉమామహేశ్వరికి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మెటిల్డాదేవి, మల్లీశ్వరి లు మాట్లాడుతూ తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామని జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చెప్పి నాలుగున్నరేళ్లు గడుస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వివిధ రకాల యాప్‌లతో ఇబ్బందులు పెడుతూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. వివిధ రకాల యాప్‌లో రద్దుచేసి ఒక యాప్ ద్వారా విధులు నిర్వహించే విధంగా చేయాలన్నారు. మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, అర్హులకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్లో ఉన్న సెంటర్ అద్దెలు, 2017 ఏడాదికి సంబంధించిన టిఎ బిల్లులు ఇతర బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. కచ్చితమైన కొలతలతో ప్రతినెలా 5వ తేదీలోపు నిర్దేశించిన సరుకులు నాణ్యత ఉండేలా చూడాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఈ అంశాలపై సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు అనుబంధ అంగన్వాడి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నాలో అంగన్వాడిలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించే వరకూ దశల వారిగా పోరాటం చేస్తామని చెప్పారు.

అసెంబ్లీలో మాట్లాడాలని ఎమ్మెల్యేకు వినతి

గురువారం నుండి జరగనున్న అసెంబ్లీ సమావేశాలలో అంగన్వాడీల సమస్యలపై మాట్లాడాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అంగన్వాడీలు, యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. అంకిత భావంతో పనిచేస్తున్నా అంగన్వాడీలకు సరైన గుర్తింపు లేదని ఆవేదన వెలిబుచ్చారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో పోలిస్తే తమకు ఇస్తున్న వేతనాలు ఏ మాత్రమూ సరిపోవని, కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని అన్నారు. సెంటర్ల నిర్వహణకు సంబంధించి బిల్లులు పెండింగ్లో ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత శాఖ మంత్రి కమిషనర్లు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. వీటిపై అసెంబ్లీలో ప్రస్తావించి తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను అంగన్వాడీలు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు నిర్మల, కవిత, ధనలక్ష్మి అంనగ్వాడీలు పాల్గొన్నారు.

సాగర్ ఆస్పత్రిలో ఆయుస్మాన్‌భవ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని విజయపురిసౌత్ సిహెచ్‌సి సూపరింటెండెంట్ డాక్టర్ కెపి చారి అన్నారు. ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా నాగార్జున సాగర్ విజయపురిసౌత్ సిహెచ్‌సి వద్ద బుధవారం ఆరోగ్య మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి బూడిద మంగమ్మ కుమారుడు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, ఆస్పత్రి అభివద్ధి కమిటీ వైస్ చైర్మన్ టి.పరమేశ్వరరావు మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ ఆస్పత్రులకు అనేక సదుపాయాలను కల్పిస్తోందని చెప్పారు. అందులో భాగంగానే ప్రతినెలా ఆయుస్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు పోతినేని సురేష్, డిజిఒ విజయలక్ష్మి, నిరంజన్‌రెడ్డి, మహేష్, రవి, ఓవైస్, శ్రావణ్ నాయక్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు లాకా వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోకుంటే నాకు ఫోన్ చేయండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అచ్చంపేట


గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరరావు

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యాయో లేదో తెలుసుకునేందుకే 'మనకోసం మన శంకరన్న' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు అన్నారు. బుధవారం అచ్చంపేట మండల పరిధిలోని కోనూరు, కస్తల గ్రామాల్లో గ్రామ సభలో ఏర్పాటు చేశారు. కస్తలలో మురుగునీరు పోయే మార్గం లేదని కల్వర్టు, ఏర్పాటు చేయలని కోరగా అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెప్పారు. లోవోల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ సమస్యలను వారంలో పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు పట్టించుకోకుంటే తనకు ఫోన్ చేయాలని స్థానికులకు చెప్పారు.

పందుల స్వైరవిహారంతో రోగాల భయం

ప్రజాశక్తి - క్రోసూరు



మండల కేంద్రమైన క్రోసూరు, మండలంలోని పలు గ్రామాల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. క్రోసూరులో మురుగు కాల్వలు, వీధులు, ఖాళీ స్థలాల్లో యథేచ్ఛగా సంచరిస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. దీంతో రోగాల భారిన పడుతున్నామని పలువురు వాపోతున్నారు. క్రోసూరులో పందుల సమస్య అధికంగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీస్‌స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఎంఇఒ కార్యాలయం వెళ్లే రహదారిలోనే చికెన్ షాప్‌ల వారు వేసే వ్యర్థాళ కోసం పందులు గుంపులుగా వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కె.శ్రీలత

తక్కువ ఖర్చుతోనే పోషకాహారం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని శాలివాహన నగర్‌లో బుధవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ కె.శ్రీలత మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, పప్పు దినుసులతో కూడిన ఆహారాన్ని, కూరగాయలు పండ్లు, చిరుధాన్యాలతో, మనం రోజు తీసుకునే ఆహారంలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అన్ని పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, ఉబ్బనంజు, కట్టనంజు వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

రెండు నెల్లుగా అద్దె బకాయి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని వివిధ గ్రామాల్లో అంగన్‌వాడి భవనాలకు అద్దె చెల్లించాలని టిడిపి నాయకులు చెయరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలో 33 అంగనవాడి కేంద్రాలు ఉండగా వీటిల్లో 23 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, జులై, ఆగస్టు నెలల అద్దెలింకా చెల్లించలేదని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు సత్వరమే స్పందించాలన్నారు.


జిలాని బాషాను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

జగన్ మళ్లీ సీఎం కావాలని పాదయాత్ర

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సిఎం కావాలని కాంక్షిస్తూ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన జిలానిబాషా ఇచ్ఛాపురం వరకు 4200 కిలోమీటర్ల పాటు పాదయాత్ర చేస్తున్నారు. ఆయన బుధవారం సత్తెనపల్లికి చేరుకున్న సందర్భంగా వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. నాయకులు సిహెచ్ సాంబశివరావు, అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.

117 జీవోతో పాఠశాలలు కనుమరుగు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జీవో 117ను రద్దు చేయకుంటే ప్రాథమిక పాఠశాలలు కనుమరుగవుతాయని రాష్ట్ర ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం మన రాష్ట్రంలో 32 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం 42 వేల పోస్టులు మిగులు చూపుతోందని పేర్కొన్నారు. యాప్ పనులను రద్దు చేసి బోధనకే ఉపాధ్యాయులను పరిమితం చేయాలని, జీతాలు ఆలస్యం లేకుండా విడుదల చేయాలని కోరారు. కస్తూర్బా విద్యాలయాల ఉపాధ్యాయులుకు మూణ్ణెల్లుగా జీతాల్లేవని, మున్సిపల్ పాఠశాలలకు నాలుగేళ్లుగా స్కూల్ గ్రాంట్ జమ కాలేదని తెలిపారు. హైస్కూళ్లలో 3, 4, 5 తరగతుల విలీనాన్ని విరమించుకోవాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ విషయాన్ని తేల్చి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ హైస్కూల్స్‌లో జూనియర్ కాలేజీలను ఏర్పాటు చేయాలని, అర్బన్ ఎంఇఒను కేటాయించాలని డిమాండ్ చేశారు.

హెల్త్ యూనివర్సిటీ వీసీని బర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఎంబిబిఎస్ సీట్ల భర్తీలో రిజర్వేషన్ నిబంధనలు పాటించని వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయ ఉపకులపతిని ప్రభుత్వం తక్షణమే బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు జె.పాల్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 54 వేల ర్యాంక్ వచ్చిన వారికి రిజర్వేషన్లు కేటగిరీలో చూస్తూ 60 వేలు వచ్చిన వారిని ఓపెన్ కేటగిరీలో సీట్లు భర్తీ చేయటం ఏమిటని ప్రశ్నించారు. వీసీపై చర్యలు తీసుకోకుంటే న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

రవికుమార్‌కు పురస్కారాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి



సత్తెనపల్లికి చెందిన బెజగం రవి కుమార్‌కు తెలుగు భాషా దినోత్సవం 2023 పురస్కారం, తెలుగు వెలుగు జాతీయ విశిష్ట కళా ప్రపూర్ణ గౌరవ పురస్కారాలు లభించాయి. తెలుగు వెలుగు సాహితి వేదిక 'గ్రేటర్ వరంగల్' ఆధ్వర్యంలో ఈనెల 17 హైదరాబాద్‌లో ఈ పురస్కారాలను అందుకున్నారు. పురస్కారాలను తన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు రవికుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కొల్లిపర మండలంలో

జగనన్నకు చెబుదాంలో 78 ఫిర్యాదులు

ప్రజాశక్తి - కొల్లిపర

జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించి సహేతుకంగా పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కొల్లిపర ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జెసి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతు దరఖాస్తులు ఆన్లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కార్యక్రమానికి హాజరైన జిల్లా మరియు మండల అధికారులతో సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి మాట్లాడుతూ ఫిర్యాదులలో అధిక భాగం రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులున్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు దరఖాస్తులు అందిన 90 రోజుల్లో స్థలాలను గుర్తించి అర్హులైన లబ్ధిదారులకు అందించాల్సి ఉందన్నారు. ఇందుకు గాను ఆన్లైన్ ద్వారా సంబంధిత విఆర్ఓ , తహశీల్దార్ , సబ్ కలెక్టర్లు సంయుక్త కలెక్టర్ లాగిన్‌కు అర్హత గల దరఖాస్తులు ఫార్వర్డ్ చేసిన అనంతరం పరిశీలించి ఆమోదించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఆ స్థలంలో బోర్డులను పెట్టి పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాకుమాను మండలంలో సెప్టెంబర్ 13 వ తేదీన జరిగిన మొదటి మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన 66 ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. ఇంతకు ముందు కొల్లిపర మండలానికి సంబంధించి ప్రజల నుండి అందిన ఫిర్యాదుల పరిష్కారంలో సంతృప్తి స్థాయి చాలా తక్కువగా వుందని, అలాగే అధికంగా ఫిర్యాదులు రీ ఓపెన్ అవుతున్నట్లు తెలుపుతూ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించి క్షుణ్ణంగా పరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం కలక్టరేట్ నందు ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంతో పాటు , రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రతి బుధవారం మరియు శుక్రవారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీడీ డీఆర్డీఏ హరిహర నాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. వెంకటేశ్వర్లు, డిఇఓ శైలజ, స్టెప్ సిఇఓ పల్లవి, ఉద్యాన శాఖ ఏ.డి రవీంద్ర బాబు, డియం అండ్ హెచ్ఓ డా. శ్రావణ బాబు, పంచాయితీ రాజ ఎస్.ఇ సురేష్, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఇ బ్రహ్మయ్య, మండల ప్రత్యేక అధికారి కృష్ణారావు, తహశీల్దార్ రవి, యంపీడీఓ విజయలక్ష్మి, యంపీపీ భీమవరపు పద్మావతి, కొల్లిపర మార్కెట్ యార్డు చైర్ పర్సన్ అవుతు సీత, జిల్లా అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.



డిసెంబర్‌లో గృహ ప్రవేశాలు

యాక్షన్ ప్లాన్‌కు అధికారులకు కమిషనర్ ఆదేశాలు

ప్రజాశక్తి - గుంటూరు సిటి

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులు వేగవంతం చేసి, డిశంబర్ నాటికి గృహ ప్రవేశాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులతో జగనన్నకాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనుల పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ళ నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను, ఏమినిటి కార్యదర్శులను అడిగి తెలుసుకు న్నారు. ప్రతి లే అవుట్ నుండి కాంట్రాక్టర్ ప్రతి రోజు నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని కమిషనర్ తెలిపారు. లే అవుట్ ల వారిగా ఎప్పటికప్పుడు పనుల పురోగతి పై నివేదిక ఇవ్వాలని, ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి పనుల వేగవంతంకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఎఫ్ఎంఎస్ కోడ్ జనరేట్ కాని వారి వివరాలు హౌసింగ్ ఎండి కార్యాలయంతో సంప్రదించి పరిష్కరించాలని ఈ.ఈ.ని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు బిల్స్ కోసం ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శుల పై చర్యలు తీసుకోవాలని ఎస్.ఈ.ని ఆదేశించారు.అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులు పై సమీక్షించి డ్రాయింగ్ బ్రాంచ్ లో నిబంధనలకు విరుద్ధంగా అధికారుల అనుమతి లేకుండా టెండర్ ఓపెన్ చేసిన ఔట్సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ ని విధుల నుండి తొలగించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న డ్రాయింగ్ బ్రాంచ్ ఆపరేటర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లను బదిలీ చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. డ్రాయింగ్ బ్రాంచ్ పనితీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్రాంచ్ లో వెంటనే వర్క్ లోడ్ తక్కువ ఉన్న ఎమినిటి కార్యదర్శులను కేటాయించాలన్నారు. గాంధీ పార్క్ త్వరలో ప్రారంభం కానున్నందున పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఈ.ఈ.ని ఆదేశించారు.



వికలాంగునికి కృత్రిమ కాలు అందజేత

ప్రజాశక్తి - తెనాలి :పట్టణానికి చెందిన ట్రూ లివింగ్ హోప్ చారిటీ సంస్థ ఆధ్వర్యంలో వికలాంగునికి కృత్రిమ కాలును ఏర్పాటు చేయించారు. చుండూరు మండలం కారుమూరువారి పాలెం కు చెందిన కూచిపూడి ఆనంద్‌కు అనారోగ్య కారణాలతో వైద్యులు అతని ఎడమకాలిని తొలగించారు. ఈ నేపథ్యంలో ట్రూ లివింగ్ చారిటీ సంస్థ స్పందించింది. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు గురిందపల్లి పవన్ కుమార్, అమతలూరి రత్న ప్రకాష్ సారథ్యంలో రూ. 20 వేల విలువైన కత్రిమ కాలును బాధితునికి ఏర్పాటు చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి నిత్యాసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో గేర నాని, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్ కుటుంబ సభ్యులు సంస్థకు కతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి :ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో బిల్లు ఆమోదం కొరకు పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళగిరి అంబేద్కర్ సెంటర్లో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి ఏడవ రోజు చేరాయి. దీక్షా శిబిరాన్ని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు చెందోలు విక్టర్ పాల్ ప్రారంభించారు. దీక్షలో కే నాగేశ్వరరావు, ఏ నాగేశ్వరావు, ఎస్ శ్యామల, కోటి పాల్గొన్నారు.

విజేతలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు

ప్రజాశక్తి - కాకుమాను :మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఉపాధ్యాయులు గోపిచంద్ తెలిపారు. బుధవారం కాకుమానులోని నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటలపోటీలను ఎంపిడిఒ సి రామకృష్ణ రిబ్బను కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఇఒ కెఎస్ కెనడి విజయభాస్కర్, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

మహానాడులో అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ మహానాడు 16వ రోడ్డులో బుధవారం విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలోరెండు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎంసి వైసిపి అధ్యక్షులు వేమారెడ్డి, యు.కల్యాణ్, జి.శ్రీను, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా అందని రేషన్ సరుకులు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రభుత్వం పౌర సరఫరాల దుకాణాల ద్వారా రేషన్ ఇతర నిత్యావసర సరుకులు గత ఆరు నెలల నుంచి సక్రమంగా పంపిణీ జరగడంలేదని తాడేపల్లి వాసులు వాపోతున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రతినెలా సగం మందికి మాత్రమే రేషన్ అందుతుందని చెబుతున్నారు. ఎండియు ద్వారా కొంత మంది కార్డుదారులకు మాత్రమే రేషన్ అందుతుందని, మిగిలిన వారికి అందడంలేదని వాపోతున్నారు. రెండు నెలల క్రితం కొత్తూరులో రేషన్ దుకాణాల్లో జరుగుతున్న అవకతవకలపై సబంధిత సచివాలయ సిబ్బందిని ప్రశ్నించగా మొబైల్ వాహన సిబ్బంది వారి సొంత పనులు చూసుకుంటూ విధులకు హాజరు కాకపోవడం వల్ల రేషన్ బియ్యం అందించలేక పోయామని చెప్పిన సమాధానం స్థానికుల్లో ఆగ్రహావేశాలు కలిగించాయి. రేషన్ బియ్యం సరఫరాలో లోపాలు న్నాయని, భవిష్యత్తులో ఇటువంటివి జరగ కుండా చర్యలు తీసుకుంటామని సచివాలయ సిబ్బంది పేర్కొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారుల మాటలు నేటికీ అమలు కాలేదని వాపోతున్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు రేషన్, ఇతర నిత్యావసర సరుకులు పంపిణీ చేయకుండా అవకతవ కలు జరుగుతున్నట్లు లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. దీనిపై మొబైల్ వాహన సిబ్బందిని ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారని చెబు తున్నారు.

విచారించి చర్యలు తీసుకోవాలి : సిపిఎం

తాడేపల్లిలో కొత్తూరుతో పాటు పలు రేషన్ దుకాణాల పరిధిలో జరుగుతున్న అవకతవకలపై పౌర సరఫరాల శాఖ విజిలెన్స్ డిపార్టుమెంట్ పూర్తిస్థాయిలో విచారించాలని సిపిఎం కొత్తూరు శాఖ కార్యదర్శి డివి భాస్కరరెడ్డి డిమాండ్ చేశారు. రేషన్ సరఫరాలో అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

మట్టి నమూనాల సేకరణపై కెవిఎస్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - తెనాలి

వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టిన మట్టి నమూనాల సేకరణ పై విద్యార్థులకు శిక్షణనిచ్చారు. స్థానిక జగ్గడిగుంటపాలెం కేంద్రీయ విద్యాలయంలో బుధవారం విద్యార్థులకు సాయిల్ హెల్త్ కార్డ్ యాప్ ద్వారా మట్టి నమూనాల సేకరణ పై శిక్షణ నిర్వహించారు. మండల పరిధిలోని, గుడివాడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులతో కలిసి విద్యార్థులు 21 మట్టి నమునాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ పి రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పైలట్ ప్రాజెక్ట్ లో భాగంగా మొత్తం 50 మట్టి నమునాలను విద్యార్థులు సేకరించవలసి ఉందన్నారు. అయితే అనుకూలతను బట్టి, మరికొన్ని మట్టి నమునాలను కూడా ఇతర గ్రామాల నుంచి సేకరించటానికి వ్యవసాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. ప్రాజెక్టు లో భాగంగా కెవిఎస్ కు అందించిన సాయిల్ టెస్టింగ్ కిట్ (మినీ ల్యాబ్) ద్వారా విద్యార్థులే స్వయంగా సేకరించిన మట్టి నమూనాలను విశ్లేషిస్తారన్నారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యలయ ఉపాధ్యాయులు కెవి.రాజేంద్ర ప్రసాద్, భవిష్య, మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్ సాగర్, డి ఆర్ సి ఎఒ రాజవంశి, తెనాలి ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఎఈఓలు సౌజన్య, రమేష్ బాబు, గుడివాడ విఎఎ ఎ.అనుష, నందివెలుగు విఎఎ ఐ మౌనిక పాల్గొన్నారు.



నమూనాల సేకరణలో విద్యార్థులు



వక్తలతో విద్యార్థులు, వివిఐటి బృందం

విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపిన టెడ్ఎక్స్ వివిఐటి

ప్రజాశక్తి-తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరులో బుధవారం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో 'టెడ్ ఎక్స్ వివిఐటి (మారుతున్న ప్రపంచం)' పేరిట నిర్వహించిన సదస్సు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. విద్యార్థులనుద్దేశించి ప్రముఖ సైకాలజిస్ట్ ఘూగ్ధాని మన్సి, ట్రైన్ మై బ్రెయిన్ వ్యవస్థాపకులు అనిష్ బెహేటి ముఖ్యవక్తలుగా ప్రసంగించారు. ప్రముఖుల జీవితాలను ఉటంకిస్తూ, వారు ఎదుర్కొన్న ప్రతికూల పరిస్థితులు, వాటిని అధిగమించి సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. వివిఐటి చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రేరణ కల్పించేందుకు ఇలాంటి సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సదస్సులో టెస్టింగ్ సాఫ్ట్వేర్ నిపుణులు భగేశ్వర్ మోహన్, స్టెమీ పై గాల్స్ ఫౌండర్ అనీషా మద్రపు, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకున్న లఘుచిత్ర దర్శకులు దీపక్‌రెడ్డి, ప్రముఖ నటి నభా నటేష్, అర్కిటెక్ట్ అశ్వని స్వేత, వివిఐటి విద్యార్థులు హర్ష, సమీర మాట్లాడారు. కార్యక్రమంలో వివిఐటి వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లిఖార్జునరెడ్డి, టెడ్ఎక్స్ సంధానకర్త పాలపర్తి బిందు మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శారదా చలపతి

ఎవర్‌గ్రీన్ హీరో అక్కినేని చిరస్మరణీయులు

ప్రజాశక్తి-తెనాలి:

సినీరంగంలో ఎవర్‌గ్రీన్ హీరో అక్కినేని నాగేశ్వరరావు చిరస్మం ణీయులని శారదా నికేతన్ నిర్వాహకులు శారదా చలపతి అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని బొల్లి ముంత ఫౌడేషన్ హాల్లో అభ్యుదయ కళాసమితి, తెనాలి కల్చరల్ ఫిల్మ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం అక్కనేని నాగేశ్వరరావు శతజయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత అక్కినేని చిత్రపటానికి నివాళులర్పించారు. శారత చలపతి మాట్లాడుతూ 93 ఏళ్ళ వయసు వరకూ అక్కినేని సినిమాల్లో నటన ప్రశంసనీయమన్నారు. ఇస్కస్ జిల్లా నాయకులు శ్రీదేవి మాట్లాడుతూ అక్కినేని నాటక రంగం నుంచి సినీరంగంలోకి అడుగు పెట్టారని, తన తననతో ఎంతో మంది అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, టి.జగన్మోహనరావు, పలువురు కళాకారులు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

స్వరలయ ఆధ్వర్యంలో అక్కినేనికి నివాళి

చలనచిత్ర రంగంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు చెరగని ముద్ర వేశారని స్వరలయ వేదిక అధ్యక్షులు లక్కరాజు సాయి అన్నారు. స్థానిక మారిసు పేటలోని స్వరలయ వేదిక కార్యాలయంలో అక్కినేని శతజయంత్యోత్సవం నిర్వహించారు. సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత అక్కినేని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కావూరు సత్యనారాయణ ను అక్కినేని పురస్కారంతో సంస్థ బృందం సత్కరించింది. కార్యక్రమంలో పినపాటి సురేష్ బాబు, కె విమల్ కుమార్, శ్రీధర్, వెంగళరావు, హేమంత్, మల్లేశ్వరరావు ,వెంకీ, ప్రశాంత్, శ్రీనివాస్, రమణయ్య పాల్గొన్నారు.



విజ్ఞాన్స్ వర్సిటీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి - గుంటూరు సిటి


యాకోబ్‌నకు పిహెచ్‌డి పట్టా అందజేస్తున్న విసి తదితరులు

చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డీ. యాకోబుకు తమ యూనివర్సటీ సీఎస్‌ఈ విభాగంలో బుధవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'యాన్ ఎఫిసియంట్ క్రిప్టో స్కీమ్ ఫర్ ప్రైవసీ ప్రిసర్వేషన్ ఆఫ్ అన్‌స్ట్రక్చర్డ్ టెక్ట్స్ అండ్ స్ట్రక్చర్డ్ డేటా ఇన్ పబ్లిక్ క్లౌడ్' అనే అంశంపై పరిశోధన చేశారని తెలియజేశారు. ఈయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని అడ్వాన్స్డ్ సీఎస్‌ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ దొండేటి వెంకటేషు గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. యాకోబు తన పరిశోధనలో మొత్తం 3 స్కూపస్ ఇండెక్డ్స్ జర్నల్స్, 3 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ పేపర్లు పబ్లిష్ చేశారని తెలియజేసారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డీ.యాకోబును వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

వర్సిటీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఏఎన్‌యు


మాట్లాడుతున్న విసి పి రాజశేఖర్

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆద్వర్యంలో విశ్వవిద్యాలయం పూర్వ అంతర్జాతీయ విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగినది. లిబియా, వియత్నాం, మయన్మార్ విద్యార్థులు కొంతమంది ప్రత్యక్షంగా పాల్గొన్నారు. షుమారు 20 దేశాల నుండి పరోక్ష పద్ధతిలో ఆన్లైన్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను తెలుసుకొని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి. రాజశేఖర్ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇటీవల కాలంలో పదికి పైగా ప్రవేశపెడుతున్న నూతన పి జి కోర్సుల గురించి తెలియజేశారు. విదేశీయులకు విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన ప్రొఫెసర్ పోస్టులను కేటాయిస్తామన్నారు. వారి బోధన, పరిశోధన అనుభవాలను విశ్వవిద్యాలయ విద్యార్థులకు, పరిశోధక అధ్యాపకులకు అందించమని కోరారు. వారికి అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. గత 33 సంవత్సరాలుగా అమెరికాలో స్థిరపడిన విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ కొర్రపాటి రఘు విద్యాలయం ప్రత్యేకతలను గుర్తించి తమ వంతు సహాయ సహకారాలు అందించటానికి ఆమోదాన్ని తెలిపారు. అమెరికాలో స్థిరపడిన మరొ విద్యాలయ పూర్వ విద్యార్థిని డాక్టర్ స్నేహ కూడా వచ్చి ఇక్కడ కొన్ని రోజులు పాటు తమ బోధన పరిశోధన నైపుణ్యాలను విద్యార్థులతో పంచుకుంటా మన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర రావు, ప్రస్తుత డైరెక్టర్ చెన్నారెడ్డి, పలు కళాశాలల ప్రిన్సిపల్స్ ప్రొఫెసర్ గంగాధర్ రావు, ప్రొఫెసర్ స్వరూప రాణి, ప్రొఫెసర్ శ్రీనివాసరెడ్డి, ప్రొఫెసర్ సిద్దయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఇంటర్నేషనల్ స్టూడెంట్ సెల్ మాజీ డైరెక్టర్, ప్రస్తుతం పూర్వ విద్యార్థుల సంఘ డైరెక్టర్ ప్రొఫెసర్ జివిఎస్ఆర్ ఆంజనేయులు నిర్వహించారు.



నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వండి

పత్తి రైతులకు సునీత సూచన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పత్తి రైతులు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కె.సునీత కోరారు. బుధవారం స్థానిక లక్ష్మీపురం కాటన్ అసోసియేషన్ సమావేశ మందిరంలో ఏపీ కాటన్ అసోసియేషన్, స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్స్ అసోసియేషన్, రైతులతో ముఖాముఖి సదస్సు నిర్వహించారు. రాష్ట్రంతో మిగతా ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో మెరుగైన ప్రత్తి పంటల ఫల సాయంతో రైతులు, వ్యాపారస్తులు అత్యధిక ఆదాయం పొందుతుంటే కష్ణ,గుంటూరు జిల్లాల రైతులు నాణ్యత ప్రమాణాలపై దష్టి సాధించకపోవడం వల్ల నష్టాలకు గురవుతున్నారని

చెప్పారు. పత్తి సరఫరా చేయటంలో జన్నింగ్ ప్లాస్టిక్ బ్యాగుల్లో వాడటం వల్ల నాణ్యత తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గుజరాత్ హర్యానా, పంజాబ్, తెలంగాణ, తమిళనాడు తదితర రాష్ట్రాలో మాదిరిగా జూట్ బ్యాగ్‌లను వినియోగించాలన్నారు. స్పిన్నింగ్ మిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లంకా రఘురామిరెడ్డి, బెటర్ కాటన్ ఇనిషియేటివ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి, కార్యదర్శి కొర్రపాటి రామారావు, గౌరవ అధ్యక్షులు గోరంట్ల పున్నయ్య చౌదరి, రైతు నాయకులు మేకల లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో

అక్టోబర్ 2న చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



స్వాతంత్ర్య సమర యోధులు మహాత్మా గాంధీ జయంతి అక్టోబర్ 2న సందర్భంగా బాల,బాలికలను చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్ వలి తెలిపారు. బుధ వారం విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో చిత్రకళ పోటీలు నిర్వహిం చాలని నిర్ణయించినట్లు ఆయన విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు యువి రామరాజు మాట్లాడుతూ బాలల్లోని సృజనాత్మక శక్తిని బయటకు తీయటానికి ఈ పోటీలు దోహదం చేస్తాయన్నారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో జరుగుతున్న బాలోత్సవాల గురించి వివరించారు. బాలల్లో ఉన్న అనేక కళలను, సృజనాత్మక అంశాలను వెలికి తీయటానికి బాలోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. గాంధీ స్మారక సమితి అధ్యక్షులు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ గాంధీ జయంతిని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింస దినోత్సవంగా ప్రకటించిందని, గాంధీ జీవన విలువలను పిల్లలకు నేర్పాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గాంధీ జయంతి రోజున నరసరావుపేట పట్టణంలో బాల బాలికలకు చిత్రకళ పోటీలు నిర్వహించడానికి విశ్రాంత ఉపాధ్యాయులు కట్టా కోటేశ్వరావు కన్వీనర్‌గా కమిటీని ఏర్పాటు చేశారు. నరసరావుపేట పట్టణం, రూరల్ మండలం, రొంపిచర్ల, నకిరికల్లు మండలాల పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని వారు తెలిపారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు (సబ్ జూనియర్స్)కి గాంధీ బొమ్మను చిత్రించాలని, 6,7,8 తరగతుల విద్యార్థులు పచ్చదనం పరిశుభ్రత మీద చిత్రాలు గీయాలని, 9, 10 తరగతులకు చెందిన సీనియర్ విద్యార్థులకు గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం అనే అంశాల మీద చిత్రకళ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీలను జయప్రదం చేయటానికి ఉపాధ్యాయులు, పట్టణ మేధావులు, ప్రజానీకం సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు చిన్నా, నాగయ్య, ప్రముఖ ఉపాధ్యాయులు ఎమ్మెస్సార్ కె. ప్రసాద్, హనుమయ్య, మోహన్ రావు, భాగేశ్వరీ దేవి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా బిల్లుకు మద్దతు తెలిపాం : గల్లా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

లోక్‌సభలో మహిళాబిల్లుకు యథాతథంగా మద్దతు తెలిపామని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ తెలిపారు. ఈమేరకు ఢిల్లీ నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ బిల్లుకు టిడిపి మద్దతు తెలుపుతుందని ఎప్పటి నుంచి తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఈ బిల్లు ఆమోదం కోరుకుంటున్నారని తెలిపారు. సుదీర్ఘ కాలం తర్వాత చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదంపై ఎంపి గల్లా జయదేవ్ హర్షం వ్యక్తం చేశారు.

అందరికీ ప్రాతినిధ్యం ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పార్లమెంట్ సమావేశంలో మహిళా బిల్లులో ఎస్‌సి,ఎస్‌టి,బిసి, మైనార్టీల ప్రాతినిధ్యం పొందుపర్చకపోవడం అన్యాయమని రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు, భారతదేశంలో నూటికి 85 శాతం మంది ఉన్నా ఈ తరగతులకు ఇప్పటికి చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేదన్నారు. చట్టసభల్లో బిసిలకు ప్రాతినిధ్యం ఇస్తామని చెబుతున్నా రాజకీయపార్టీలు ఇంతవరకు చిత్తశుద్ధితోపనిచేయలేదన్నారు. అగ్రవర్ణ పాలకులైన బిజెపి గాని రాష్ట్రంలో ఉండా వైసిపి గాని కేంద్రంలోని అగ్రవర్ణాలు రాష్ట్రంలో ఉండే అగ్రవర్ణాలు కలిసి అన్యాయం చేశారని, పార్లమెంట్లో లో బిసి,ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీ ఎంపిల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఏకపక్షంగా బిల్లు ఆమోదించుకున్నారని అన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మార్పులకు చర్యలు

రాజకీయపార్టీల సమావేశంలో కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల మార్పులు, నూతన కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తీ చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు తో కలసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా, ఆమ్ ఆద్మీ పార్టీ తరుపున డాక్టరు తాతా సేవా కుమార్ (రాష్ట్ర స్పోక్స్ పర్సన్) బహుజన్ సమాజ్ పార్టీ తరపున చిరుతనగండ్ల వాసు (గుంటూరు పశ్చిమ నియోజక వర్గ ఇన్ చార్జ్), భారతీయ జనతా పార్టీ తరుపున రాచుమల్లు వెంకట భాస్కరరావు (జిల్లా జనరల్ సెక్రటరీ),

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున బిళ్ళా సునీల్ (జిల్లా ప్రదాన కార్యదర్శి, జిల్లా ఆఫీస్ ఇన్చార్జి) , తెలుగుదేశం పార్టీ తరుపున కంచెర్ల శివరామయ్య (కార్యాలయ సెక్రటరీ), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున అత్తోట. జోసెప్ కుమార్ (రాష్ట్ర సెక్రటరీ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2024 లో భాగంగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించటం జరిగిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు స్వయంగా సందర్శించి రాజకీయపార్టీల ప్రతినిధుల తెలిపిన అంశాలను పరిగణలోకి తీసుకోని పోలింగ్ కేంద్రాల మార్పులకు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయపార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పోలింగ్ కేంద్రాల మార్పుల ప్రతిపాదనలపై వివరాలు చర్చించటం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, నూతన పోలింగ్ కేంద్రాలపై ఎన్నికల సంఘం పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు జారీ చేసిందని, దీని ప్రకారమే ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1879 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో వివిధ కారణాలతో 265 పోలింగ్ కేంద్రాలు ప్రదేశం మార్పుకు, 227 కేంద్రాల పేరు మార్పుకు, నూతనంగా ఐదు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. వీటిపై రాజకీయపార్టీల ప్రతినిధులు అభ్యంతరాలు తెలిపితే వాటిని పరిగణలోకి తీసుకొని పూర్తి స్థాయిలో విచారించి తుది నివేదికను రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపటం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి దరఖాస్తులను నిర్దేశిత సమయానికి సక్రమంగా పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ ముస్తఫా తూర్పు నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల మార్పులపై ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డికి అందించగా వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు లలితా, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజ, డీఆర్డీఏ పీడీ హరిహరనాధ్ , కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు, తహశీల్దార్లు నగేష్, సాంబశివరావు, శ్రీకాంత్, ఫణీంద్ర బాబు, రవిబాబు, శర్మ, నాగిరెడ్డి, రాంప్రసాద్, యంటీయంసీ అడిషనల్ కమిషనర్ హేమమాలిని తదితరులు పాల్గొన్నారు.

కన్యాకపరమేశ్వరి ఆలయానికి స్వతంత్ర ప్రతిపత్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని లాలాపేట కన్యకాపరమేశ్వరి దేవాలయంకు త్వరలో స్వతంత్ర ప్రతిపత్తిని కల్పింస్తామని ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా తెలిపారు. ఆలయంలో బుధవారం రాత్రి జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంపై గురువారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు హాజరు అయి సిఎంతోపాటు సంబంధిత మంత్రితో చర్చించి త్వరగా ఉత్తర్వులు వచ్చేలా చూస్తానని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాలి గిరి మాట్లాడుతూ ఆలయంలో వచ్చే దసరా ఉత్సవాలకు నేరెళ్ల హరి ప్రసాద్ ఛైర్మన్‌గా 70 మందితో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కమిటీకి టి.ఎల్.వి.ఆంజనేయులు గౌరవ అధ్యక్షులుగా వ్యవహరిస్తారని తెలిపారు. 102 సంవత్సరాల చరిత్ర కలిగిన కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌కుమార్ కమిటీ సభ్యుల వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.